

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

నేత్రదానముతో ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపిన సాంబశివరావు కుటుంబం.



Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 214 పేజీలు - 08 వెల - 05/- శుక్రవారం 31-07-2026

# పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం.. రాజ్యసభలోనూ ఆమోదం పొందిన బిల్లు



- రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే అమల్లోకి చట్టం
- గరిష్ఠంగా రూ.10 కోట్ల జరిమానా
- జైలు శిక్ష, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ
- ఎన్‌టీఏపై ప్రతిపక్షం విమర్శలు
- సమగ్ర సంస్కరణలపై కొనసాగుతున్న డిమాండ్


దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, పేపర్ లీక్‌లను అరికట్టడం లక్ష్యంగా తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లుకు గురువారం రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రపతి అంగీకారం లభించగానే ఇది చట్టంగా అమల్లోకి రానుంది. కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, మిగతాది 2లో




# ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్

- గత ప్రభుత్వ చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసం కోల్పోయింది
- త్వరలో ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు క్లీన్ ఎనర్జీ ఎగుమతులు
- పరిశ్రమలు తేవడం మా బాధ్యత -- కష్టపడటం యువత బాధ్యత
- టాటా రెన్యువబుల్ ఎనర్జీ శంకుస్థాపన సభలో మంత్రి నారా లోకేష్

పత్తికొండ: ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల తొలి ఎంపిక అయ్యిందని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, జూఙు, ఫ్రూ+ వంటి గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని, టాటా పవర్, సుజ్లాన్, రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ఘాజవీజు, వారీ వంటి ప్రముఖ భారతీయ కంపెనీలు ఇక్కడ విస్తరిస్తున్నాయని లోకేష్ వెల్లడించారు. పత్తికొండ సమీపంలోని హోసూరులో టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ (ఫ్రూ=జూూ) ఆధ్వర్యంలో రూ. 5,350కోట్లతో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటుచేయబోయే 800 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు గురువారం మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ... గత ఏడాదితో పోలిస్తే, మిగతాది 2లో



# '2034 వరకు నేనే సీఎం'..

## ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ

55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని వ్యాఖ్య

- టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం
- విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు
- ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం
- ప్రతి నెల ఒకటో తేదీన జీతాల హామీ




విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తాను ఒక్కటే చెబుతున్నానని రేవంత్ అన్నారు. "మీ సమస్యలు నాకు వదిలేయండి. మీరు అడగకముందే వాటిని పరిష్కరిస్తాను. మిగతాది 2లో

# మచిలీపట్నం-బంటుమిల్లి రోడ్డు నిర్మాణానికి సహకరించండి

- బందరు పోర్టు, మంగినపూడి బీచ్ సహా పారిశ్రామికాభివృద్ధికి అండగా నిలవండి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ప్రతిపాదనలు అందించిన మంత్రి కొల్లు రవీంద్ర



న్యూఢిల్లీ, జులై 29: కృష్ణా జిల్లా సమగ్రాభివృద్ధికి, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి అండగా నిలిచే మచిలీపట్నం-బంటుమిల్లి రోడ్డు నిర్మాణానికి సహకరించాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీని ఢిల్లీలోని వారి కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఈ రోడ్డు నిర్మాణంతో మచిలీపట్నం పోర్టు, మంగినపూడి బీచ్‌కు రోడ్డు కనెక్టివిటీ పెరుగుతుంది. తద్వారా ఈ ప్రాంతంలో పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం అవుతాయి. ప్రధానంగా మచిలీపట్నం పోర్టు అనుసంధానంగా వచ్చే ఇండస్ట్రియల్ కారిడార్స్, లాజిస్టిక్స్ పార్క్లు, ఎంఎస్ఎంఈ క్లస్టర్స్ కు సానుకూల వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. సుమారు రూ. 150 కోట్ల వ్యయంతో కృష్ణా జిల్లాలోని బందరు పోర్టు నుండి మంగినపూడి బీచ్ మీదుగా మిగతాది 2లో



# పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి

- పంచాయతీలకు కేంద్రం విడుదల చేస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్న బండి సంజయ్
- నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలని సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆరోపణ
- నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలన్న బండి సంజయ్

2

# ఇంటింటికి తెలుగుదేశం

## 2026 కార్యక్రమం నాలుగో రోజూ విజయవంతం



- రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు రోజుల్లో 9 లక్షల ఇళ్లను సందర్శించిన పార్టీ శ్రేణులు
- కార్యకర్తలను అభినందిస్తున్న మంత్రి నారా లోకేష్
- ఎస్సెమ్మెస్‌లు పంపిస్తూ, నేరుగా ఫోన్‌లో మాట్లాడుతూ ప్రోత్సహిస్తున్న లోకేష్

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఇంటింటికి తెలుగుదేశం--2026" కార్యక్రమం నాలుగో రోజూ రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున గడప గడపకూ వెళ్లి ప్రజలను కలిసి, కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగో రోజున రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.80 లక్షల ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించగా, గత నాలుగు రోజుల్లో మొత్తం 9 లక్షల ఇళ్లకు చేరుకుని ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మిగతాది 2లో

# విశాఖ రైల్వేకు శుభవార్త..

## రూ.299 కోట్లతో కొత్త లైన్లు, ప్లాట్‌ఫారాలు

- ఆరు కొత్త లైన్లు, ప్లాట్‌ఫారాల నిర్మాణం
- రైళ్ల ఆలస్యం, రద్దీ తగ్గించడమే లక్ష్యం
- తూర్పు వైపు కొత్త ప్రవేశ ద్వారం
- విశాఖ రైల్వే స్టేషన్ నుంచి రోజూ సుమారు 80 వేల మంది ప్రయాణం

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో పెరుగుతున్న రద్దీకి చెక్ పడనుంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రైళ్ల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రూ. 299 కోట్లతో విశాఖ కోచింగ్ యార్డు ఆధునికీకరణకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో స్టేషన్ నిర్వహణ సామర్థ్యం పెరగడంతో పాటు



2

# సాయి కృష్ణ అదృశ్యం కేసు.. విజయవాడ కోర్టుకు సీఐ నాగరాజు

- సుప్రీంకోర్టు ఆదేశాలతో నాగరాజును కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసులు
- రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విజయవాడ కోర్టుకు తీసుకొచ్చిన పోలీసులు
- కోర్టు ప్రక్రియ పూర్తయిన వెంటనే కస్టడీలోకి తీసుకోనున్న అధికారులు

మిగతాది 2లో



తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సాయి కృష్ణ అదృశ్యం కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కీలక ముందడుగు వేశారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న ఈ కేసులోని

# ఢిల్లీలోని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఇంటికి టిబెటన్ పార్లమెంట్ ప్రతినిధులు.

పల్లె వెలుగు న్యూఢిల్లీ. న్యూ ఢిల్లీలోని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ



**న్యూ ఢిల్లీలోని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఇంటిలో టిబెటన్ పార్లమెంట్ ప్రతినిధుల బృందం చర్చలు**



న్యూ ఢిల్లీలోని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఇంటిలో టిబెటన్ పార్లమెంట్ ప్రతినిధుల బృందం చర్చలు

డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఇంటికి గురువారం టిబెటన్ పార్లమెంట్ ప్రతినిధుల బృందం రాగానే ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సాధర స్వాగతం పలికి ఆహ్వానించారు. టిబెటన్ పార్లమెంట్ ఉపసభాపతి ఖెన్పో సోనం టెన్‌ఫెల్, పార్లమెంట్ సభ్యులు చోడాక్ గ్యాట్సో, గ్యాల్ట్సెన్ చోఎక్యి లు ఢిల్లీలోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి నివాసానికి విచ్చేసి ఇరు దేశాల మధ్య పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా టిబెటన్ ప్రజలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి, పరస్పర ఆసక్తి కలిగిన విషయాలపై అభిప్రాయాలను పంచుకున్నామని, టిబెటన్ పార్లమెంట్ ప్రతినిధులు సమర్పించిన వినతిపత్రంలో ప్రస్తావించిన అంశాలను తగిన వేదిక ద్వారా భారత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు.

# మిట్నాల గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం.

**-పైప్‌లైన్ పనులను ప్రారంభించిన టీడీపీ నాయకులు శీలం నాగ ప్రదీప్ కుమార్ రెడ్డి.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. ఎల్‌నినో ప్రభావంతో నంద్యాల నియోజకవర్గ పరిధిలోని



మిట్నాల గ్రామంలో ఏర్పడిన తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం లభించనుంది. న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశాల మేరకు, యువ నాయకులు ఫిరోజ్ , ఫయాజ్ ల ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో నూతన తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. గ్రామ ప్రజల సహకారం, గ్రామీణ నీటి సరఫరా (ఆర్డబ్ల్యూఎస్) శాఖ అధికారుల సూచనలతో శీలం నాగ ప్రదీప్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ఈ పైప్‌లైన్ పనులు శరవేగంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శీలం నాగ ప్రదీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చేయడం కోసం ఈ పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని తెలిపారు. త్వరలోనే పనులను పూర్తి చేసి, ఓవర్‌హెడ్ ట్యాంకుల (రక్షిత మంచినీటి ట్యాంకులు) ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని అన్నారు . మన గ్రామం -- మన బాధ్యత అనే లక్ష్యంతో గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని వారు తెలిపారు . తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి ఫరూక్ గారికి, పనుల ప్రారంభానికి సహకరించిన గ్రామ పెద్దలు, యువత, మరియు గ్రామ ప్రజలకు శీలం నాగ ప్రదీప్ కుమార్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు శీలం రాజేశ్వర్ రెడ్డి , శీలం మహేశ్వర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను కలిసిన ప్రభుత్వ న్యాయవాదులు గౌరవ వేతనం పెంచాలని వినతి.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని ప్రభుత్వ న్యాయవాదులు నంద్యాలలోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాదుల (గవర్నమెంట్ ప్లీడర్స్) గౌరవ వేతనాన్ని పెంచవలసిందిగా కోరుతూ మంత్రి ఫరూక్ కి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు గవర్నమెంట్ ప్లీడర్ (జి.పి) కృష్ణమూర్తి, నంద్యాల అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏ.జి.పి) వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకెళ్లామని, మారుతున్న కాలానికి అనుగుణంగా గౌరవ వేతనాన్ని పెంచాలని కోరినట్లు తెలిపారు. వినతి పత్రంపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ , ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు .

# మై భారత్ పోర్టల్‌లో యువత నమోదు ప్రక్రియను చేపట్టండి.

**☛నశా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ, యూత్ క్లబ్‌ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించండి.**

**☛జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో 16 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతను పెద్దఎత్తున మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మై భారత్ పోర్టల్‌లో యువత నమోదు కార్యక్రమాన్ని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్ ఆఫీసర్, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, డి ఎస్ డి ఓ లు సమన్వయంతో విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ, వృత్తి విద్యాశాఖ, డిగ్రీ కళాశాలల కన్వీనర్లు తమ పరిధిలోని విద్యార్థులందరినీ పోర్టల్‌లో నమోదు చేయించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్‌-ఎస్, ఇండియన్ రెడ్‌క్రాస్, క్రీడా వాలంటీర్లు, డీఆర్‌డీఏ, మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాల కుటుంబాల యువత, నర్సింగ్, పారామెడికల్ కళాశాలల విద్యార్థులు, ఇతర యువజన సంఘాల సభ్యులు కూడా మై భారత్ పోర్టల్‌లో నమోదు అయ్యేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

యువతలో సృజనాత్మకత, సామాజిక చైతన్యం పెంపొందించేందుకు పెయింటింగ్, వ్యాసరచన, క్విజ్, నృత్య పోటీలు తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి, యువజన సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో పోటీల షెడ్యూల్ రూపొందించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని తదుపరి స్థాయికి ఎంపిక చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీ స్థాయిలో యూత్ క్లబ్‌లను ఏర్పాటు చేసి యువతను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి, డిప్యూటీ సీఈఓలు గ్రామ పంచాయతీల వారీగా యూత్ క్లబ్‌ల ఏర్పాటును పర్యవేక్షించి, ఎంపీడీఓల ద్వారా సంబంధిత వివరాలను నమోదు చేయించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా నిర్వహిస్తున్న నశా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా యువతందరూ ఆన్‌లైన్‌లో ప్రతిజ్ఞ చేసి సర్టిఫికెట్ పొందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన సాంకేతిక అంశాలు, కమ్యూనికేషన్ ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యువతకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. మై భారత్ పోర్టల్‌లో నమోదుకు సంబంధించి ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, రిఫరల్ కోడ్ విధానాన్ని వినియోగిస్తూ మరింత మంది యువతను పోర్టల్‌లో నమోదు చేయించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# నేత్రదానముతో ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపిన సాంబశివరావు కుటుంబం.





పల్లె వెలుగు నంద్యాల రూరల్. నేత్రదానముతో ఇద్దరి జీవితాల్లో సుమారు డెబ్బై ఐదు సంవత్సరాల వయస్సు గల పుణ్యమూర్తి శాంబశివరావు మరణానంతరం నేత్రదానం చేసి ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపేలా గొప్ప మానవతా సేవకు నాంది పలికారు. ఆయన కుమారులు పుణ్యమూర్తి శ్రీకాంత్, పుణ్యమూర్తి శంకర్, పుణ్యమూర్తి చంద్రమోహన్ కలిసి ఈ విషయాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ కండే ఆనంద్ గురుజీకి సమాచారం అందజేశారు. వెంటనే స్పందించిన కండే ఆనంద్ గురుజీ ఈ సమాచారాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరికి తెలియజేశారు.

ఆయన చొరవతో కర్నూలు ఐ బ్యాంక్ వారు సంఘటన స్థలానికి చేరుకుని టెక్నీషియన్ ప్రదీప్ నేతృత్వంలో నేత్రాలను సేకరించి హైదరాబాద్ లోని ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ కు పంపించారు. కండే ఆనంద్ గురుజీ మాట్లాడుతూ "మరణించిన తర్వాత కూడా ఇంకొకరి జీవితానికి వెలుగు నింపడం కన్నా గొప్ప దానం లేదు. శాంబశివరావు కుటుంబ సభ్యులు తీసుకున్న ఈ నిర్ణయం సమాజానికి స్ఫూర్తిదాయకం. ప్రతి కుటుంబం ఇలాంటి సేవాభావంతో ముందుకు వచ్చి నేత్రదానం, అవయవదానంపై అవగాహన పెంపొందించాలి" అని పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు శాంబశివరావు కుటుంబ సభ్యుల సేవాభావాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తూ, వారి నిర్ణయం అనేక మందికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. "నేత్రదానం మహాదానం. మన మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగు నింపే అవకాశం ప్రతి ఒక్కరికీ ఉంది. ప్రతి కుటుంబం ముందుకు రావాలి" అని రెడ్ క్రాస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ సందేశం సమాజానికి నిజమైన మానవతా విలువలను గుర్తు చేస్తుంది.

# బసవరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకుని నంద్యాల జిల్లాలో శాంతి, మత సామరస్యాన్ని పరిరక్షించాలి -- అదనపు ఎస్పీకి వినతి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజాస్వామ్య



లౌకిక ఐక్యవేదిక ఆధ్వర్యంలో నేడు నంద్యాల జిల్లా అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ని కలిసి ఒక వినతిపత్రాన్ని సమర్పించామని ఐక్యవేదిక నాయకులు తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో ప్రసారమైన ఒక వీడియోతో పాటు, గత కొంతకాలంగా సోషల్ మీడియా వేదికలలో వెలువడిన కొన్ని పోస్టులు, వ్యాఖ్యల వల్ల మత సామరస్యానికి భంగం కలిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయనే ఆందోళనను పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ అంశాలపై సంబంధిత డిజిటల్ ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించి, చట్టం ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు.

వీడియోలో ఒక వ్యక్తిని అవమానించే విధంగా ప్రవర్తించడం, అలాగే ఒక మత వర్గాన్ని ఉద్దేశించి అభ్యంతరకరమైన పదజాలం ఉపయోగించినట్లు కనిపిస్తున్న అంశాలను నిష్పాక్షికంగా విచారించి, చట్టవిరుద్ధమైన చర్యలు జరిగి ఉంటే భారతీయ న్యాయ సంహిత, 2023, సమాచార సాంకేతిక చట్టం, 2000 మరియు ఇతర వర్తించే చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. అదేవిధంగా, సంబంధిత వ్యక్తిపై గతంలో నమోదైన కేసుల వివరాలను పరిశీలించి, చట్టం ప్రకారం అవసరమైతే తగిన నివారణ చర్యలు తీసుకోవాలని కూడా పోలీసు అధికారులను కోరినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ, నంద్యాల జిల్లా ఎల్లప్పుడూ అన్ని మతాల ప్రజలు సోదరభావంతో జీవిస్తున్న ప్రాంతమని, కొందరి వ్యక్తిగత చర్యల కారణంగా మత సామరస్యం దెబ్బతినకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే ప్రచారాలు లేదా చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోరాదని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన మార్గాన్ని మాత్రమే అనుసరించాలని పిలుపునిచ్చారు. అదనపు ఎస్పీ వినతిపత్రాన్ని స్వీకరించి, అందులో పేర్కొన్న అంశాలను చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు ఎస్.ఎం.డి. అబుల్ లైస్, క్రిస్టియన్ జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాస్టర్ జానయ్య మన్నెం, జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షులు అబ్దుల్ సమద్, సిపిఐ రాష్ట్ర నాయకులు బాబా ఫక్రుద్దీన్, ఎస్‌డిపిఐ జిల్లా అధ్యక్షులు ఎజాజ్ హుస్సేన్, ఆర్‌పిఎఫ్ అడ్వకేట్ శివకృష్ణ, అడ్వకేట్ శ్రీనివాసులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మస్తాన్, వెల్ఫేర్ పార్టీ జిల్లా అధ్యక్షులు అన్సర్ బాషా, సెంట్రల్ కమిటీ టీం లీడర్స్ చర్చి పాస్టర్స్ పీటర్, స్పర్జన్ రాజ్, సుబ్బారావు, సురేష్ సామాజిక కార్యకర్త జకీవుల్లా, ఎస్‌డిపిఐ మజీద్, కరీముల్లా, అక్తర్ హుస్సేన్, నూరుల్ల, షఫీ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచార పోరుబాట.

- ఆగష్టు 17న కలెక్టరేట్ ముట్టడి.
- సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమం.సిపిఐ




పల్లె వెలుగు నంద్యాల రూరల్. రాష్ట్రంలో తీవ్రమైన ఎల్ నినో ప్రభావంతో కరువు కోరల్లో చిక్కుకున్న నంద్యాల జిల్లా రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని, జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులకు అవగాహన కార్యక్రమాలు, ఉపశమన చర్యలు చేపట్టాలని సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు తీవ్ర స్థాయిలో డిమాండ్ చేశారు. గురువారం నంద్యాల పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

?ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ... జిల్లాలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, గడివేముల, మిడుతూరు, కొత్తపల్లి, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు అల్లాడిపోతున్నారన్నారు. వర్షాభావం దృష్ట్యా ఖరీఫ్ సీజన్ గడువును సెప్టెంబర్ ఆఖరు వరకు పొడిగించాలని కోరారు. ఉమ్మడి జిల్లా పరిధిలోనే పంటల బీమా ప్రీమియంలో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయని మండిపడ్డారు. కర్నూలు జిల్లాలో పంటల బీమా ప్రీమియం ఎకరాకు రూ. 44 గా ఉంటే, నంద్యాల జిల్లాలో మాత్రం రూ. 450 గా అధికారులు చెప్పడం ఏంటని నిలదీశారు. ఈ తారతమ్యాలను వెంటనే సరిదిద్దాలన్నారు. ఉపాధి లేక నలిగిపోతున్న వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాలని, లేకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు చూపించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటలకు, తాగునీటికి ఆధారమైన అలగనూరు రిజర్వాయర్ గండిని 2017లో పరిశీలించి రూ. 31 కోట్లతో అంచనాలు వేశారని, ప్రస్తుత కలెక్టర్ పరిశీలించి రెండేళ్లు కావస్తున్నా ఆ గండిని పూడ్చకపోవడం దారుణమన్నారు. డోన్ ప్రాంతానికి హంద్రీనీవా ద్వారా చెరువులు నింపుతామని, రూ. 382 కోట్ల వ్యయంతో పైలట్ ప్రాజెక్ట్ చేపడతామని చెప్పిన ప్రభుత్వం నేటికీ ఆ పనులను నెరవేర్చకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తల్లడిల్లుతున్నారన్నారు. నందికొట్కూరు పట్టణానికి తాగునీరు అందక ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

?బనగానపల్లె నియోజకవర్గంలో సిమెంట్ ఫ్యాక్టరీల కోసం, అల్ట్రాటెక్, పవర్ గ్రిడ్ కంపెనీల పేరుతో రైతుల నుంచి వేలాది ఎకరాలను బలవంతంగా సేకరించి తగిన నష్టపరిహారం చెల్లించలేదని ఆరోపించారు. పాణ్యం, గడివేముల మండలాల్లో గ్రీన్ కో ప్రాజెక్టు కింద వేలాది ఎకరాలు లాక్కుని, స్థానిక నిరుద్యోగ యువతకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో పేదల భూములను అభివృద్ధి పేరిట లాక్కున్నారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ఒక సెంటు స్థలం సరిపోదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షల ఆర్థిక సాయం ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని గుర్తు చేశారు. నంద్యాల పట్టణంలో నేటికీ పేదలకు ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఫరూక్ వద్దకు వెళ్లి అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చామని, ఇకపై అర్జీలు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ?కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై సిపిఐ ఆధ్వర్యంలో సమరభేరి మోగిస్తున్నట్లు రంగనాయుడు వెల్లడించారు. ఆగస్టు 6 నుండి 15 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యలపై పాదయాత్రలు, ప్రచార ఆందోళనలు నిర్వహిస్తామని, తమ పాదయాత్రను అలగనూరు రిజర్వాయర్ నుంచే ప్రారంభిస్తామన్నారు. ఈ క్రమంలోనే ఆగస్టు 17న నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆ తర్వాత ఆగస్టు 18 నుండి 25 వరకు సిపిఐ అనుబంధ ప్రజా సంఘాలైన మహిళా సమాఖ్య, వ్యవసాయ కార్మిక సంఘం, యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విస్తృత అవగాహన, ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించని పక్షంలో సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో 'చలో ఢిల్లీ' ధర్నా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా కార్యదర్శి సోమన్న, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు
# 4వ రోజు డోర్ టు డోర్ కార్యక్రమం.

- కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తున్న వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల టౌన్ 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు





4వ రోజు డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు పర్యటించారు. ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతూ 2ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం గురించి ప్రజలకు తెలియజేస్తూ కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు మరియు అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. అదేవిధంగా నంద్యాల పట్టణం నందు మరి ముఖ్యంగా మన వార్డు నందు మంత్రి ఎన్ఎండి.ఫరూక్ పూర్తి చేసిన అభివృద్ధి పనులు గురించి ప్రజలకు తెలుయజేయడం జరిగిందని అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు,స్థానిక ఎమ్మెల్యే, న్యాయ మరియు మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి.ఫరూక్ వారి కుమారులు ఎన్ ఎం డి.ఫిరోజ్, ఎన్ ఎం డి.ఫయాజ్ పర్యవేక్షణలో నిర్వహించడం జరిగిందని అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు మహేష్ బాబు, రమణ మరియు బూత్ కన్వీనర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అన్నమలై యూనివర్సిటీ నుండి పీ హె చ్ డి అందుకున్న కె రామకృష్ణ.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల రాజీవ్ గాంధీ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన అధ్యాపకుడు కె.రామక్రిష్ణ అన్నమలై యూనివర్సిటీ చిదంబరం నుండి పీ హెచ్ డి అందుకున్నారు. అన్నమలై యూనివర్సిటీ ప్రధాన అధ్యాపకులు డా. ఎస్.బాలాజీ,మరియు రాజీవ్ గాంధీ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రధాన అధ్యాపకులు డా ఎం. సుధీర్ కుమార్ పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించిన ఆయన, 2026 జూలై 15న డాక్టరేట్ సాధించారు. ఆయనా పరిశోధనా సిద్ధాంతం "జుటటవష్అజవఅవం శీట ్= ఖఋఖ్రీ్వఅఎం "శీ అఎజూతీశీజవ ప్రబుఖఅ తీవంశీబతీషవ ఋఖ్సవవవత్ జూతీఖ్షఅవం ఖఅ వఎజూశ్రీశీఎవవ జూవతీటశీతీఋఅషవ అఅ ×అఎఋఅ ఙ వీచీజ అనే అంశంపై పరిశోధన సాగింది... ఈ సందర్భంగా ఆర్ జి ఎం విద్యా సంస్థల ఛైర్మన్ డా. ఎం. శాంతిరాముడు, మేనేజింగ్ డైరెక్టర్ ఎం. శివరాం, కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. జయచంద్ర ప్రసాద్, డీన్ డా. డి వి.అశోక్ కుమార్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి విద్యా, పరిశోధనా రంగాల్లో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# ఇంటింటికి తెలుగుదేశం: కూటమి పాలనలో
# రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం

- పుట్టపర్తి నియోజకవర్గం కంబాలపర్తి, బొంతలపల్లి గ్రామాల్లో ఘనంగా 'ఇంటింటికి తెలుగుదేశం'
- పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్పర్సన్ కమ్మరి పార్వతమ్మ





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, విద్యా మరియు ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ సూచనల మేరకు "ఇంటింటికి తెలుగుదేశం – రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం పుట్టపర్తి నియోజకవర్గంలో గురువారం ఘనంగా నిర్వహించారు.

కంబాలపర్తి మరియు బొంతలపల్లి గ్రామాలలో స్థానిక శాసనసభ్యురాలు శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ పరిశీలకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ప్రచార కరపత్రాలను పంపిణీ చేస్తూ, గత రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాబాహుళ్యంలోకి తీసుకువెళ్లారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో నేరుగా ముచ్చటించి, వారి సమస్యలు, సలహాలు మరియు అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్పర్సన్ కమ్మరి పార్వతమ్మ మాట్లాడుతూ --- "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోంది. చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన నాయకత్వంలో, లోకేష్ పర్యవేక్షణలో ప్రవేశపెట్టిన ప్రతి పథకం అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరుతోంది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంబాలపర్తి, బొంతలపల్లి గ్రామాల యూనిట్ ఇన్చార్జిలు, బూత్ ఇన్చార్జిలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొత్తూరు సుబ్బరాయుడు సన్నిధిలో వరుణ యాగము..



పాణ్యం జూలై 30 పల్లె వెలుగు : మండలంలోని ఎస్ కొత్తూరు గ్రామంలో వెలసిన ప్రముఖ శైవ క్షేత్రము శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానము నందు గురువారం వరుణ యాగము నిర్వహించారు.రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారుల ఉత్తర్వుల మేరకు లోక కళ్యాణార్థం అన్ని దేవస్థానాల యందు వరుణ యాగములు నిర్వహంచవలెనని అధికారుల తెలిపిన ఆదేశముల అనుసరించి ఆలయ ఈఓ రామ క్రిష్ణ ఆధ్వర్యంలో ఈ యాగము నిర్వహించారు.ఈ సందర్భముగా వేద పండితులు ప్రధాన అర్చకులు సురేష్ శర్మ, సుబ్బయ్య స్వామి, నాగమయ్య స్వామి వారు 108 కషలములతో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి సావాస్త్ర ఘట్టాభిషేకం నిర్వహించారు. అనంతరం హోమశాల యందు గణపతి పూజ, వరుణ పూజ,వరుణ యాగము నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గాజులపల్లెలో చెత్తా చెదారం.. దుర్వాసన..!

- పారిశుద్ధ్యం కరువై.. అనారోగ్యం చేరువై..
- దోమలతో సమరం.. రోగాల భయం..
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ కాలువలు..





పల్లె వెలుగు మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో ఎస్సీ కాలనీలో చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లడంతో దోమలు రాజ్యం మెలు తున్నాయి.గ్రామాల్లో స్వచ్ఛభారత్ – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం పేరుతో ఇంటి పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తుంటారు. అలాంటి ప్రభుత్వ అధికారులే తమ కార్యాలయాలకు పరిమితం అవటంతో ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. గత నెల రోజులుగా పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉన్న అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు.పరిసరాలు చెత్తచెదారంతో నిండిపోయాయి. ఎక్కడపడితే అక్కడ కవర్లు, పేపర్లు, వ్యర్థ పదార్థాలు పడిఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.మురు గునీటి కాలువల్లో నీరు పారలేక రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో రోడ్డంతా దుర్వాస వెదజల్లుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. రహదారులపై పారుతున్న మురుగునీటిలో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళ న వ్యక్తం చేస్తున్నారు.డ్రైనేజీ కాలువల్లో మురుగు నీరు ఎక్క డిక్కడ నిలిచిపోవడంతో దుర్వాసనతో పాటు దోమల ఉత్పత్తితో అల్లాడుతున్నామని, రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. దోమలతో విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని భయాందోళనకు గురవుతున్నారు. గ్రామాల్లో మౌళిక వసతులు లేకపోవ డంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మండల అధికారులు మాత్రం తమ కార్యాలయాలకు పరిమితమయ్యారని ప్రజలు మండిపడుతు న్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తి కి నెల రోజుల జైలు శిక్ష



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 30: చెడు ప్రవర్తన కలిగిన ఒక వ్యక్తికి నంద్యాల మెజిస్ట్రేట్ నెల రోజుల పాటు జైలు శిక్ష విధించారని ఎస్ఐ జగన్మోహన్ గురువారం పేర్కొన్నారు. బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పార్లపల్లి గ్రామానికి చెందిన విజయ వర్ధన రెడ్డి అనే వ్యక్తి తల్లిదండ్రులను తరచుగా ఇబ్బంది పెడుతూ ఉండేవాడని ఎస్ఐ పేర్కొన్నారు. దీనికి తోడు గ్రామంలో చాలామందిని బెదిరిస్తూ, అల్లరిగా తిరుగుతున్న కారణంగా ముద్దాయిని కోర్టులో హాజరుపరచడం జరిగిందని పేర్కొన్నారు. విచారణ అనంతరం నంద్యాల రెండవ తరగతి మెజిస్ట్రేట్ ముద్దాయికి నెల రోజులపాటు జైలు శిక్ష విధించడం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు.

## గ్రామఅభివృద్ధిలోఆయువకులు అందరికీ ఆదర్శంగా నిలిచారు

దొర్నిపాడు జులై 30 పలివెలుగు న్యూస్ మండలంలోని అమ్మిరెడ్డి నగర్ గ్రామంలో గ్రామ ప్రజలు పశువులు, తాగడానికి ఇతర వాటికి వాడుకోవడానికి గతంలో నీటికుంటనుఏర్పాటుచేసుకున్నారు, కాలక్రమేనచేతిపంపులు నీటి కొళాయిలు వాడుకలోనికి రావడంతో కుంటలోని నీరు మురికి చేరి కలుషితమై కంప చెట్లతో కుంటలోని నీళ్లు బురద నీరుగా మారి దుర్వాసన రావడంతో గ్రామ యువకులు చక్రవర్తి నాయుడు సారధ్యంలో మన గ్రామం మన అందరి గ్రామం అనే నినాదంతో యువకులు ముందుకు వచ్చి కుంట లో ఉన్న మురికినీరు ముళ్ల పొదలనుతొలగించి ఆయువకులుఅందరికీ ఆదర్శంగానిలిచారు ,ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చక్రవర్తి నాయుడు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ భాగస్వాములమై కుంటనుబాగుచేసుకున్నామన్నారు,మా గ్రామంలో రాజకీయాలు ఉన్న గ్రామాభివృద్ధిలో అందరముఒకటే అన్నారు, కుల మత రాజకీయాలకు అతీతంగా ఉన్నందుకే మా గ్రామం ఉత్తమ పంచాయతీగా ఎంపికై నిర్మల్ పుష్కర అవార్డులు కూడా మేము దక్కించుకున్నామన్నారు





# ఫిర్యాదులపై సత్వరం స్పందించండి

## డిడి అరుణ్ కుమార్



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 30 : ప్రజల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే దరఖాస్తులపై స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్ కుమార్ పేర్కొన్నారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఎర్నపాడు సచివాలయంలో గ్రామ సర్వేలతో డిప్యూటీ డైరెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా సకాలంలో వాటిని పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. దరఖాస్తుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఎప్లైన్ సర్వే పనులను ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాలు, ప్రామాణిక విధానాల ప్రకారం నిర్వహించాలని చెప్పారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి విధానపరమైన లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకొని, పారదర్శకంగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని గ్రామ సర్వేలను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు ప్రతి గ్రామ సర్వేయర్ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని డిప్యూటీ డైరెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగప్రసాద్ తో పాటు గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

## మహిళల అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు.

ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూలై 30 అమాయకులైన మహిళలకు మాయమాటలు చెప్పి, వారిని అక్రమ మార్గాల్లో తరలించి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎమ్మిగనూరు జెసి జె కోర్టు జడ్జి పి.హేమ అన్నారు. గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం నందవరం గ్రామంలో జాతీయ మహిళల అక్రమ రవాణా నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మహిళలను మాయమాటలు చెప్పి వారిని అక్రమంగా ఇతర దేశాలకు తీసుకెళ్లి విక్రయించడం, వారితో తప్పుడు పనులు చేయించడం లాంటి పనులు చేస్తే అలాంటి వారికి కఠిన శిక్షలు ఉంటాయన్నారు. అభివృద్ధి చెందుతున్న నేటి ప్రపంచంలో మహిళలు అన్ని విషయాలపై అవగాహనలు కలిగి ఉండాలని సూచించారు. ఇలాంటి సంఘటనలు ప్రజల దృష్టికి వేస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించి వారిని కాపాడాలని కోరారు. అలాగే ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు ఎక్కువ ఉన్నాయని వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిమ్మారెడ్డి ,పోలీస్ సిబ్బంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# గార్లదిన్నె - అలేబాద్ వాటర్ గ్రిడ్ పంప్‌హౌస్‌ను పరిశీలించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ





పల్లె వెలుగు –?ప్యాపిలి ప్యాపిలి మండలంలోని గార్లదిన్నె గ్రామం నుంచి అలేబాద్ గ్రామానికి మంచినీటిని సరఫరా చేస్తున్న వాటర్ గ్రిడ్ పంప్‌హౌస్‌ను డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ కేంద్ర మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ?గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పంపిణీ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందో లేదో తెలుసుకునేందుకు ఆయన ఈ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పంప్‌హౌస్‌లోని మోటార్లు, నీటి నిల్వ ట్యాంకులు, ఫిల్ట్రేషన్ యూనిట్లను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, పనితీరుపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ గార్లదిన్నె నుంచి అలేబాద్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు నీటి సరఫరాలో ఎలాంటి సాంకేతిక అంతరాయాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని నిరంతరం నాణ్యమైన, సురక్షితమైన తాగునీటిని మాత్రమే అందించాలని ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీలు మోటార్ల మరమ్మతులు ఉన్నట్లయితే నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.?గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా చూడటమే కూటమి ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశమని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ఏమాత్రం రాజీ పడేది లేదని కోట్ల తెలిపారు.

?ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సీమ సుధాకర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు సుదర్శన్, నేరెడుచెర్ల వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

## ప్రజల గడపకు కూటమి సంక్షేమం..

# ఈబీజీ గోవింద్ గౌడ్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం





హోళగుంద పల్లె వెలుగు జులై :30 ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు హొళగుంద మండలం ఇంగళదహాళ్ గ్రామంలో "ఇంటింటికి కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలు" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఈబీజీ గోవింద్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. భూత్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్ రెడ్డి పరిధిలోని భూత్ నెం.52లో హనుమంతు ఇంటి నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో రూ.4,000 సామాజిక పింఛన్, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు తదితర ప్రజా సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో సంక్షేమం, అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తున్నాయని, ప్రజలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఇదేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. అదేవిధంగా, ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకులు ఈబీజీ గోవింద్ గౌడ్, గ్రామస్తులు తెలిపిన ప్రతి సమస్యను ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు యారిస్వామి, జనసేన మండల కన్వీనర్ అశోక్, బీజేపీ మండల కన్వీనర్ ప్రసాద్, హుస్సేన్ పీర, బాగోడి రాము, సింధువలం మలి, రామాంజి, టీడీపీ యువనేత ఈబీజీ రాజేంద్ర గౌడ్, టీడీపీ మైనార్టీ మండల అధ్యక్షుడు ముల్ల మొయిన్, వెంకటేష్, కో-క్లస్టర్ రారవి సిద్ధు, పవన్, 34వ భూత్ ఇన్‌చార్జ్ మలయ్య, కానయ్య, జనసేన నాయకుడు వెంకటేష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కూటమి కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అభివృద్ధి,సంక్షేమమే కూటమి లక్ష్యం తెదేపా నేతలు,

రెండేళ్ల నమ్మకం ఇంటింటికి టిడిపి కార్యక్రమం,,





నందవరం పల్లె వెలుగు జులై :30 అభివృద్ధి,సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నందవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ ధర్మపురం గోపాల్,తెదేపా మండల నాయకులు రైస్ మిల్ నారాయణరెడ్డి లు పేర్కొన్నారు.నందవరం మండలం హాలహర్వి గ్రామంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు 2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి,సంక్షేమం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు ఇంటింటికీ (డోర్ టు డోర్) తిరుగుతూ కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.సంక్షేమం భవిష్యత్తుకు భరోసా అన్ని ప్రాంతాల అభివృద్ధి అనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజల కోసం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు.ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు,ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరించి,కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా అవగాహన కల్పించారు.ఎమ్మెల్యే బీవీ నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు ఎర్రన్న,క్లస్టర్ కో ఇన్చార్జి నాగరాజు,టిడిపి మండల కార్యదర్శి ప్రభుదాసు,బూత్ కన్వీనర్లు రాఘవేంద్ర,హరి కృష్ణ,టిడిపి నాయకులు జగన్నాథ్ రెడ్డి,గోవిందు, సురేష్,చిన్న దావీదు,రాగప్ప,ఎర్రం నాయుడు,కాసిం,ఏసేపు,యంకన్న,బుడ్డ రంగన్న,ఆంధ్రయ్య,ఉరుకుందు,జి దుబ్బన్న, వెంకటరాముడు,కార్పెంటర్ కాజా,బోయ రవి,టైలర్ మాబు,రామకోటి,వెంకటేష్,గాలి సంసోను,కల్లు గోవిందు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.



రుద్రవరం.పల్లె వెలుగు : రైతులు సాగుచేసిన పంటలలో ఆశించే తెగుళ్ల నివారణకు అధికారులు సూచించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. గురువారం మండలంలోని నరసాపురం టి లింగం దిన్నె గ్రామాలలో వ్యవసాయ అధికారిని జి సుమతి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం నంద్యాల వారు పలు రకాల పంటలను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. డాక్టర్ వెంకట రమణమ్మ ప్రధాన శాస్త్రవేత్త ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాల వారు మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మరియు ఎల్ నినో ప్రభావం వలన పంటల మీద ఈ ప్రభావం చూడడానికి నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి డాక్టర్ వెంకటరమణ డాక్టర్ ఇషా పర్వీన్ లు రుద్రవరం మండలంలోని పలు గ్రామాలలో పంటలను పరిశీలించారు .బెట్ట పరిస్థితులలో భాగంగా మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ప్రభావం అధికంగా ఉండడాన్ని గమనించారు. దీని నివారణకై ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.48 గ్రాములు లీటర్ నీటికి మరియు క్లోరంట్రా నీలిప్రోల్ 0.3 ఎమ్ఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవడం వలన ఈ పురుగును అదుపులో ఉంచవచ్చును మరియు పచ్చిమిరప పంటలలో అధికంగా పై మూడు వైరస్ తెగులను గమనించారు. వీటి నివారణకు ప్రస్తుతం ఉన్న పంట యొక్క దశల ఆధారంగా నీలం రంగు జిగురు కట్టలను 40 నుంచి 50 ఒక ఎకరాకు ఏర్పాటు చేసుకోవాలి మరియు వేప నూనె పదివేల పిపిఎం 1 ఎంల్ ఒక లీటరు కి కలిపి పిచికారి చేయాలి లేదా రసాయనిక మందులైన స్పైనోసార్ 0.3 ఎశ్రీ లేదా ఫ్లూక్సా మెటా మిడ్ 0.28 ఎశ్రీ నీటికి లేదా ఐసోప్రో క్లోసెరమ్ ఒకటి పాయింట్ రెండు ఎమ్మెల్కి లేదా డైరీ ఫాన్సీరామ్ 1.25 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవడం వలన తామర పురుగులను అదుపులో పెట్టుకొని పై మూడు తెగుల్లను తగ్గించుకోవచ్చును. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు విజయ శేఖర్ ,విస్తరణ అధికారి రాజు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ జయకృష్ణ గ్రామ రైతులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కారం
# కై కదం తొక్కిన షెడ్యూల్ కార్మికులు.




- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.
- లేకుంటే అన్ని రంగాల్లో ఉత్పత్తి ని స్థంబింప చేస్తాము.
- షెడ్యూల్డ్ కార్మిక వర్గం భారీ ర్యాలీ కలెక్టరేట్ వద్ద నిరసన ధర్నా.
- సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు అంటే లెక్క లేదా కార్మికుల అనుకూల తీర్పు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరైంది కాదు.
- డీ ఆర్ ఓ రామునాయక్ కి సి ఐ టి యు బృందం వినతి.

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

వివిధ రంగాల్లో పని చేస్తున్న షెడ్యూల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఆయా రంగాల్లో ఉత్పత్తిని స్తంభింపజెస్తామని షెడ్యూల్ కార్మికులు హెచ్చరించారు.సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, తదితర డిమాండ్లతో కార్మికులు నంద్యాల లో పెద్ద ఎత్తున కోవెలకుంట్ల -నూనేపల్లి జంక్షన్ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు.ధర్నాకు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి. ఏసురత్నం అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమం లో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. నాగరాజు మాట్లాడుతూ కార్మిక వర్గం లేకుండా ప్రభుత్వాలు నడువలేవని వారు పని చేయకుంటే ఉత్పత్తి ఆగిపోతుందని హెచ్చరించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరచి షెడ్యూల్ కార్మికుల సమస్యల పై వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎన్నో ఏళ్లుగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న షెడ్యూల్ కార్మికుల జీవితాలు అగోమ్య గోచరంగా మారాయన్నారు.బజారు హమాలీలు, వెర్ హౌస్ లలోనూ, షాపింగ్ మాల్ లలో ను, మున్సిపాలిటీ, గ్రామ పంచాయితీ లలో పని చేసే కార్మికులు, గనుల్లో పనిచేసే కార్మికులకు చేస్తున్న పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు ఎందుకు పెంచడం లేదో సమాధానం చెప్పాలన్నారు..పనులు చేస్తున్నాం. ప్రభుత్వాలను మారుస్తున్నాం.. కానీ వచ్చిన పాలకులు కార్మికుల సంక్షేమం గురించి ఆలోచించడం లేదన్నారు.కేవలం బడా, కార్పొరేట్ సంస్థలకోసం పాలకులు పని చేస్తున్నారన్నారని ఘాటు విమర్శలు చేశారు.. కార్మిక వర్గం పోరాటాల వైపు రాకుండా నిర్బంధాలు విధించడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కు మంచింది కాదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తే రోడ్ల మీదకు కార్మికులు ఎందుకు వస్తారని ప్రశ్నించారు. జీతాలు పెంచమంటే జీవోలు ఉన్నాయా అని అడుగుతున్నారని, కానీ ఎమ్మెల్యే లకు లక్షల వేతనాలు అఘామేఘాల మీద పెంచడం న్యాయంగా ఉందా అని ప్రశ్నించారు.కనీస వేతనాలు 26 వేలు యజమానులు కానీ, ప్రభుత్వాలు ఇవ్వడం లేదని నాగరాజు విమర్శించారు. ఏళ్ల తరబడి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగుల కనీస వేతనాలు 26 వేలకు పెంచమని అడుగుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.రాష్టంలోని అన్ని షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్లలో అవసరాధారిత కనీస వేతనాలను తక్షణమే ప్రకటించి అమలు చేయాలని కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్ లను తక్షణం రద్దు చేయాలని,రాష్ట్రవేతన బోర్డు ను వెంటనే ఏర్పాటు చేసి, వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారంగా క్రమం తప్పకుండా వేతనాలను సవరించాలని ప్రతి కార్మికుడికి సమగ్ర పమాదబీమా సౌకర్యం కల్పించాలి. అర్హత కలిగిన ప్రతి కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ మరియుఇతర సామాజిక భదతా పథకాలను తప్పనిసరిగా అమలుచేయాలని,కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి మరియు అసంఘటిత రంగ కార్మికులకు కూడా సమాన కార్మిక హక్కులు, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని యాక్ట్, 1952, ఈ ఎస్ ఐ యాక్ట్, 1948 మరియు ఇతర కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలని,కనీస వేతనాలు చెల్లించని, పీఎఫ్-- ఈఎస్ఐ అమలు చేయని యాజమాన్యాలపైకఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల పతినిధులతో చర్చలు జరిపి కార్మిక సంక్షేమానికి సమగ్ర కార్యాచరణ పణాళిక రూపొందించాలని,విజయ పాలడైరిఇతర సొసైటీ, కార్పొరేషన్ ల లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి అక్రమతొలగింపుల్లో ఆపాలని,యూనివర్సిటీ పరిశోధన కేంద్రం కళాశాల గురుకులాల్లో పని చేసే కాంట్రాక్ట్ ఒ ఔట్సో ర్సింగ్ అన్ని కేటగిరీల ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అందిస్తూ దశలవారీగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా



కార్యదర్శులు లక్ష్మణ్, బాల వెంకట్, పి వెంకట్ లింగం,రామ్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు కే మహమ్మద్ గౌస్, శివరాం జిల్లా నాయకులు రణధీర్, రత్నమయ్య, మారెన్న, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బాలదుర్గ,భాస్కరాచారి రంగనాథ్, గ్రామపంచాయతీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు వీఆర్ఏ సంఘం జిల్లా నాయకులు శివరామకృష్ణ, బాలు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా నాయకులు మండల శ్రీనివాసులు గడ్డం యాకోబు 108 శేషయ్య 102 నాయకులు సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా నాయకులు సి ఆర్ పి హిమ శేఖర్ ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ ఇధాయతుల్లా, రామకృష్ణ రాఘవేంద్ర ఆర్ ఏఆర్ఎస్ అయ్యన్న, పుల్లయ్య, వీరితోపాటు వేలాదిమంది కార్మికులు పాల్గొనడం జరిగింది.

## విద్యార్థులు చెడు అలవాట్లకు గురికావద్దు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జులై 30:





విద్యార్థులు చెడు అలవాట్లకు గురికాకుండా సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని నంద్యాల శక్తి టీం బృందం విజ్ఞప్తి చేసింది. నంద్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ ఉత్తర్వుల మేరకు నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు మహిళా కానిస్టేబుల్ లక్ష్మీదేవి బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న బి కోడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం శక్తి యాప్ పై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. శక్తి యాప్ నెంబరు 7993485111 విద్యార్థిని విద్యార్థులకు తెలిపి, ఫేక్ యాప్స్, మెసేజ్లు వచ్చిన వాటిని ఓపెన్ చేయరాదని సూచించారు. ఫేక్ మెసేజ్లు ఓపెన్ చేయడం వల్ల వచ్చే ఆర్థిక నష్టాలను గురించి విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. చిన్నపిల్లలపై అత్యాచారాలు జరిగిన, బాల్య వివాహాలు జరిగిన టోల్ ఫ్రీ నెంబర్ 10 98 కి ఫోన్ చేయాలని సూచించారు. అమ్మాయిలు, మహిళలు ఆపద సమయంలో ఉన్నప్పుడు శక్తి యాప్ నంబర్ కు వీడియో కాల్ కానీ, నార్మల్ కాల్ కానీ చేస్తే పోలీస్ శాఖ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అమ్మాయిల పట్ల ఎవరైనా చెడుగా ప్రవర్తిస్తే,ఈవ్ టీజింగ్, ర్యాగింగ్లు చేస్తే, 112,100 ఫోన్ చేస్తే కూడా పోలీస్ శాఖ వెంటనే స్పందిస్తుందని అన్నారు. విద్యార్థినిలు ఇంటికి వెళ్లిన తర్వాత తమ తల్లిదండ్రుల మొబైల్ నందు శక్తి యాప్ డౌన్లోడ్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి మహిళ, శక్తి యాప్ను నమోదు చేసుకోవాలని, యాప్ మహిళలకు రక్షణ కవచంగా ఉంటుందని, మహిళల భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని పేర్కొంటూ విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## మహానంది స్వామిని దర్శించుకున్న నూతన ఎస్సీ
## సంక్షేమ అధికారి మాలపాటి వెంకట శివారెడ్డి

**జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వైనం**

**విద్యార్థుల సంక్షేమం, హాస్టళ్ల పర్యవేక్షణకు తొలి ప్రాధాన్యం**







పల్లె వెలుగు, జూలై 30 : నంద్యాల జిల్లా ఎస్సీ వెల్ఫేర్ ఎంపవర్‌మెంట్ అధికారిగా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన మాలపాటి వెంకట శివారెడ్డి సతీసమేతంగా, కుటుంబ సభ్యులతో కలిసి ప్రముఖ పుణ్యక్షేత్రం మహానందిలోని శ్రీ కామేశ్వరీ దేవి సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విధులు స్వీకరించిన అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

స్వామివారి దర్శనం అనంతరం వెంకట శివారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలు, నంద్యాల జిల్లా వాసులు, షెడ్యూల్డ్ కులాల ప్రజలు, హాస్టల్ విద్యార్థులు, సంక్షేమాధికారులు, సిబ్బంది అందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు:

ప్రభుత్వ హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి హాస్టల్‌ను నిరంతరం పర్యవేక్షిస్తానని, విద్యార్థుల సంక్షేమంలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా బాధ్యతాయుతంగా పనిచేస్తానని చెప్పారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం. నాయక్, డైరెక్టర్ లావణ్య వేణి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అదేవిధంగా ఎస్సీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రజాసంఘాలతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు.

వెల్లువెత్తిన అభినందనలు: మాలపాటి వెంకట శివారెడ్డికి మాల మహానాడు, ఎమ్మార్పీఎస్, వివిధ ఎస్సీ వర్గాల ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్థల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిజాయితీ, క్రమశిక్షణ, పారదర్శకతతో సేవలు అందించి బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

## ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం,





నందవరం పల్లె వెలుగు జులై 30 ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మరియు ఎమ్మిగనూరు శాసనసభ్యులు డాక్టర్ బి.వి జయ నాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 45 రోజుల ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా నాల్గవ రోజు నందవరం మండలం నది గంగవరం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు కాశీం వలి క్లస్టర్ వన్ ఇంచార్జ్ కురువ వీరేష్ మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ, కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో సాధించిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ ఫలితాలను వివరించారు. ప్రతి కుటుంబానికి ఇంటింటా తెలుగుదేశం కరపత్రాలను అందజేస్తూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, బసప్ప, సలాం, నూర్ భాషా బూత్ కన్వీనర్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ ప్రజలకు అందుబాటులో ఉంటారు ,
### జిల్లా జనరల్ సెక్రెటరీ మాలతి ,,,,



ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూలై 30ఎమ్మిగనూరు నియోజకవర్గ అసెంబ్లీ కార్యాలయాన్ని కర్నూలు జిల్లా జనరల్ సెక్రెటరీ గొందిపల్లె మాలతి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, నియోజకవర్గంలో చేపట్టాల్సిన సంస్థాగత బలోపేత చర్యలు, ప్రజా సమస్యలపై భారతీయ జనతా పార్టీ కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి గురురాజ్ దేశాయ్ తో మరియు బిజెపి నాయకులతో చర్చించారు... ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బి ఎల్ నారాయణ , నందవరం మండలం మాజీ సర్పంచ్ రామన్న గౌడ్, మహిళా మోర్చా కర్నూలు జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి ఎమ్మిగనూరు పట్టణ ఉపాధ్యక్షులు గాజుల సురేంద్ర, కిషన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గద్వాల రవి నాయుడు బిజెపి నందవరం మండలం ఎస్సీ మోర్చా అధ్యక్షులు కల్లెల శివ బిజెపి నాయకులు రంగస్వామి, మరియు బిజెపి కార్యకర్తలు సోషల్ మీడియా కన్వీనర్ వాల్మీకి దండు వీరేష్ పాల్గొన్నారు

## మహానంది క్షేత్రంలో వేదమంత్రాలతో వరుణ యాగం





మహానంది, పల్లె వెలుగు రాష్ట్రంలో నెలకొన్న ఎల్నినో ప్రభావాన్ని అధిగమించాలని వర్షాలు సకాలంలో కురవాలని మహానంది పుణ్యక్షేత్రంలో వేదమంత్రాలతో వరుణ యాగాన్ని ప్రారంభించారు. మూడు రోజులపాటు నిర్వహించే పూర్ణ యాగంలో భాగంగా మొదటి గురువారం ఆలయ ఈవో ఎన్.శ్రీనివాస రెడ్డి చే వేద పండితులు రవిశంకర అవధాని గణపతి పూజ పుణ్యాహవాచనం, కంకణధారణ,కలశ స్థాపన,వరుణ సూక్త పారాయణములు పూజలు నిర్వహించారు. సాయంత్రం క్షేత్రంలోని కోనేరులో జపములు చేశారు.వేద పండితులు రవిశంకర అవధాని మాట్లాడుతూ.. రాష్ట్రంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని వరుణ యాగం నిర్వహించామన్నారు. వర్షాలు కురవాలని సంకల్పంతో క్షేత్రంలో గురు శుక్ర శని వారాలలో వరుణ యాగం, సహస్రఘట్టాభిషేకం పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర కమిషనర్ ఉత్తరమేలకు మూడు రోజులు పాటు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## సున్నిపెంటలో ఈనెల 31న
# ప్రజా సమస్యల పరిష్కార వేదిక.

**"వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణ.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లా పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావడం, స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడం లక్ష్యంగా చేపట్టిన "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 31వ తేదీన శ్రీశైలం నియోజకవర్గంలోని సున్నిపెంటలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణవేణి (రెడ్డివారి) కల్యాణ మండపంలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, సంబంధిత శాఖల ద్వారా తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల సమస్యలను నేరుగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని శ్రీశైల మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు.

## ఐటీ కంపెనీలకు భూములు, భవనాలు అద్దెకివ్వండి

**- 3 సెంట్లు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న భూములు, భవనాల యజమానులు అర్హులు - నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగర పరిధిలో 3 సెంట్లు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన భూములు, భవనాలను ఐటీ కంపెనీలకు లీజుకు లేదా విక్రయించేందుకు ఆసక్తి ఉన్న యజమానులు ముందుకు రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఖాళీ స్థలాలు, నిర్మాణంలో ఉన్న భవనాలు, పూర్తిగా నిర్మించిన భవనాలను ఐటీ కంపెనీల అవసరాలకు అనుగుణంగా లీజుకు లేదా విక్రయించేందుకు ఆసక్తి ఉన్న వారు కలెక్టరేట్ కార్యాలయంలోని డీఆర్వో ఛాంబర్‌లో సంప్రదించాలని సూచించారు.ఈ మేరకు జిల్లా ఐటీ మేనేజర్ ఎస్. లీలావతి సెల్ నంబర్ 7042930572ను సంప్రదించాలని కమిషనర్ తెలిపారు. ఆసక్తి ఉన్న భూములు, భవనాల యజమానులు సంప్రదించే సమయంలో స్థలం లేదా భవనం ఫోటోలు, యజమాని పేరు, సంప్రదింపు ఫోన్ నంబర్, ఈ-మెయిల్ వివరాలు, భూమి లేదా భవనం విస్తీర్ణం, లీజుకు లేదా విక్రయానికి సంబంధించిన వివరాలు, ఆశిస్తున్న లీజు లేదా విక్రయ ధర తదితర సమాచారాన్ని అందించాలని సూచించారు.కర్నూలు నగరంలో ఐటీ రంగ అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడంతో పాటు, ఐటీ కంపెనీల ఏర్పాటుకు అవసరమైన భూములు, భవనాల లభ్యతను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఈ వివరాలను సేకరిస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. అర్హత కలిగిన భూములు, భవనాల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వివరాలను అందించాలని కోరారు.

# పంటల్లో సమగ్ర పోషక యాజమాన్యంపై సూచనలు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 30: బండి




ఆత్మకూరు స్థానిక ఏఓ కార్యాలయం నందు వ్యవసాయ శాఖ మరియు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం నంద్యాల ఎల్ నైనో పరిస్థితుల్లో రైతులు చేపట్టాల్సిన చర్యలు పంటల వారీగా సమగ్ర పోషక యాజమాన్య సూచనలను పంట ప్రణాళికను మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ విడుదల చేశారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ మంజునాథ్, డాక్టర్ రవి ప్రకాష్ రెడ్డి డాక్టర్ చైతన్య మరియు డాక్టర్ వి జయలక్ష్మి బండి ఆత్మకూరు మండలానికి ఎల్ నైనో పరిస్థితుల్లో పంట ప్రణాళికను సిఫారసు చేశారని, పంటల్లో నేల పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం, సిఫారసు చేసిన మోతాదులో నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలని అధికారులు సూచించారు. అలాగే జింక్ సల్ఫేట్, 19:19:19 వంటి సూక్ష్మ పోషకాలను అవసరానికి అనుగుణంగా వినియోగించాలని తెలిపారు. వరిలో కీలక దశల్లో యూరియా, పొటాష్ ఎరువులను విడతల వారీగా వేయడంతో పాటు నీటి యాజమాన్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మొక్కజొన్నలో విత్తిన వెంటనే కలుపు నివారణ, ఎరువుల సరైన వినియోగం, నాటిన 20--25 రోజులలో పైపాట్లు ఎరువులు వేయాలని పేర్కొన్నారు. మినుము విత్తే ముందు విత్తన శుద్ధి చేసి, సిఫారసు చేసిన ఎరువులు, సూక్ష్మ పోషకాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని, రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలని కోరారు. సోయాబీన్ ఆరుతడి క్రింద పూత మరియు కాయ ఏర్పడే కీలక దశలలో రక్షక తడిని సూక్ష్మ నీటి పారుదల పద్దతి ద్వారా అందించాలి. పొటాషియం నైట్రేట్ 5 గ్రా/లీటరు నీటికి (లేదా) యూరియా 20 గ్రా/లీటరు నీటికి (లేదా) 19:19:19 5 గ్రా/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. వరి బెట్ట పరిస్థితుల్లో వరి నారు మడులలో జింక్ మరియు ఐరన్ పోషక లోపాలు కనిపించిన వెంటనే జింక్ లోప నివారణకి జింక్ సల్ఫేట్ 20 గ్రా./లీ. మరియు ఐరన్ లోప నివారణకు 20 గ్రా. అన్నభేది ం2 గ్రా నిమ్మ ఉప్పు చొప్పున కలుపుకొని పిచికారి చేసుకోవాలి.

వరి నారు ను ఆలస్యంగా (30-35 రోజులప్పుడు) నాటుకున్నట్లైతే 25% అదనపు నత్రజని ని వేసుకోవాలి (20-25 కె.జి/ఎకరానికి) మూన తిరిగిన రోజు నుండి పైరు దుబ్బు చేయటం పూర్తి అయ్యేవరకు పొలంలో పలుచగా అంటే 2-3 సెం.మీ. వరకు నీళ్ళు పెట్టుకోవాలి మొక్కజొన్న నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో బోదెలు మరియు కాలువలు పద్దతిలో నీటి తడులు ఇవ్వాలి. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ఒక వరుస మార్చి వరుస పద్దతిలో నీటి తడులు ఇవ్వాలి. ఆరుతడి క్రింద పూతకి ముందు, పూత దశ మరియు గింజ పాలు పోసుకునే దశలలో రక్షక తడిని సూక్ష్మ నీటి పారుదల పద్దతి ద్వారా అందించాలి. పొటాషియం నైట్రేట్ 5 గ్రా/లీటరు నీటికి (లేదా) యూరియా 20 గ్రా/లీటరు నీటికి (లేదా) 19:19:19,5 గ్రా/లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. నేలలో తేమ నిల్వ ఉండేందుకు రెండు నుంచి మూడు సార్లు అంతర కృషి చేయాలి.

మినుము ఆరుతడి క్రింద, పూత మరియు కాయ ఏర్పడే కీలక దశలలో రక్షక తడిని సూక్ష్మ నీటి పారుదల పద్దతి ద్వారా అందించాలి.

పొటాషియం నైట్రేట్, 5 గ్రా/లీటరు నీటికి (లేదా) యూరియా 20 గ్రా/లీటరు నీటికి (లేదా) 19:19:19, 5 గ్రా/లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పీఎం కిసాన్ కొరకు ఈకేవైసీ తప్పనిసరి పంట బీమాకు చివరి రోజు ఏఓ పవన్ కుమార్.. పీఎం కిసాన్ పథకం కింద రైతులకు డిబిటి ద్వారా ఆర్థిక సహాయం ఇప్పటికే 23 విడుదల విడుదల అయ్యాయని, ఈ ఏడాది 2026నకు ఆగస్టు-నవంబర్ న 24వ విడత నిధులు సకాలంలో అందించేందుకు పీఎం కిసాన్ లబ్ధిదారులు ప్రతి ఒక్కరు ఈకేవైసి తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ తెలిపారు. సిఎస్సి మీసేవ కేంద్రాల్లో బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా లేదా పిఎం కిసాన్ మొబైల్ యాప్ లో ఫేషియల్ ద్వారా రైతులు ఈకేవైసి చేసుకోవచ్చని, నిజమైన అర్హులైన రైతులకు మాత్రమే ప్రయోజనం అందించేందుకు ప్రతి సంవత్సరం ఈకేవైసి తప్పనిసరి అని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని వారు తెలిపారు. అలాగే వివిధ పంటలు సాగు చేసిన రైతులు పంట బీమా చేసుకోవడానికి జూలై 31న చివరి రోజు అని, కేవలం వరి పంటకు మాత్రమే ఆగస్టు 15 వరకు అవకాశం ఉందని, రైతులు వెంటనే మీ సేవలో లేదా రుణం పొందిన బ్యాంకుల్లో ప్రీమియం చెల్లించి పంట బీమా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఏఓ కోరారు. మరింత సమాచారం కొరకు స్థానిక రైతు సేవ కేంద్ర సిబ్బంది లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయం నందు సంప్రదించాలని వారు తెలిపారు.

---

## జిల్లా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి.

**☛ఆగస్టు 1 నుంచి 13 వరకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమాలు.**

**☛జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో భాగంగా నిర్వహించనున్న కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమాలను అధికారులు పూర్తిస్థాయిలో వినియోగించుకొని జిల్లాకు సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. గురువారం ప్లానింగ్ శాఖ కార్యదర్శి పీయూష్ కుమార్ విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 13 వరకు నిర్వహించనున్న కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులకు గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ ( జి ఎస్ డి పి), గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జి డి డి పి), గ్రాస్ వ్యాల్యూ యాడెడ్ (జి వి ఎ) వంటి




అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన గణాంకాల సేకరణ, విశ్లేషణ, ప్రణాళికల రూపకల్పనలో ఈ శిక్షణ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవా రంగాలకు సంబంధించిన అంశాలపై పెహల్ ఇండియా ఫౌండేషన్ నుంచి ఐదుగురు రిసోర్స్ పర్సన్స్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 1న జిల్లా ప్రొఫైల్ రూపకల్పనపై ప్రత్యేక శిక్షణ, ఆగస్టు 5, 6 తేదీల్లో జిల్లా స్థాయి అధికారులకు పూర్తి స్థాయి శిక్షణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

అంతకుముందు ప్లానింగ్ శాఖ కార్యదర్శి పీయూష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 1 నుంచి 13 వరకు నిర్వహించనున్న కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, శిక్షణ అనంతరం జిల్లా అధికారుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించాలని సూచించారు.

శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు శిక్షణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి, జిల్లాలో అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు అధికారులు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

## త్వరలో ఆదోని జిల్లా అంశాన్ని పరిశీలిస్తాం.

**రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ.**




ఆదోని (పల్లె వెలుగు(: ఆదోనిలో జరిగిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తరువాత ఆదోని జిల్లా ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇవ్వడాన్ని ఆదోని జిల్లా సమితి స్వాగతిస్తున్నది. ఖచ్చితంగా రాబోయే అసెంబ్లీ ఎన్నికలలోపు ఆదోని జిల్లా ఏర్పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో ఏర్పాటు అవుతుంది అని మేము నమ్ముతున్నాం. ఎన్నికలలో హామీ ఇవ్వనప్పటికీ ఆదోని ప్రాంతంలో జరిగిన ఆదోని జిల్లా పోరాటానికి స్పందించిన చంద్రబాబు ప్రభుత్వం జేఏసి నాయకులతో చర్చలకు ఆదోని టిడిపి బాధ్యులు మీనాక్షి నాయుడు, అప్పటి కర్నూల్ జిల్లా టిడిపి అధ్యక్షులు తిక్కా రెడ్డి మరియు ఎమ్మెల్సీ మరియు కంబిటి నాయకుడు ను పంపి కర్నూల్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు మరియు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తో పలు దఫాలుగా చర్చలు జరపడం చంద్రబాబు ప్రజల గొంతుక వినే నాయకుడు అని నిరూపించినది. ఒక జిల్లా ఏర్పాటు అనేది అంత సులభం కాదు కాబట్టి ప్రజలు నాయకులు ఓపికతో వ్యవహరించి చంద్రబాబు ప్రభుత్వానికి సహకరిస్తూ వచ్చే ఎన్నికల్లోపు ఆదోని జిల్లా సాధించుకోవడానికి సిద్ధం కావాలి అని పిలుపునిస్తున్నాము. ఆదోని జిల్లా ఏర్పాటుతో మాత్రమే ఆదోని, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ మరియు ఎమ్మిగనూరు నియోజకవర్గాల అభివృద్ధి సాధ్యం అని స్పష్టం చేస్తున్నాము. ఆదోని జిల్లా ఏర్పాటు కోసం మొట్టమొదటిసారి నూర్ అహ్మద్ మిత్ర బృందం ఆధ్వర్యంలో 2020 లో ఏర్పాటు చేసిన ఆదోని జిల్లా సమితి ఆదోని జిల్లా ఏర్పాటు కోసం కడదాకా పోరాడుతుందని ప్రజలకు మనవి చేస్తున్నాను.

# స్మశాన వాటికకు భూమి కేటాయించాలి.

**-కుప్పగల్లు గ్రామంలో దళితులకు జీవో నెంబర్ 1235 ప్రకారం స్మశాన వాటికకు భూమి కేటాయించాలి**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మండలం కుప్పగల్లు గ్రామంలో దళితులకు చనిపోయిన తర్వాత పుడ్చుకోవడానికి స్మశానం లేక చాలా




ఇబ్బందులు పడుతున్నామని కావున ప్రభుత్వం కేటాయించిన జీవో నెంబర్ 1235 ప్రకారం భూమి కొనుగోలు చేసి స్మశానానికి కేటాయించాలని కోరుతూ కెవిపిఎస్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే లింగన్న, సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు, రైతు సంఘం మండల నాయకులు శేఖర్, డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు చిరంజీవి, ప్రజా సంఘాల నాయకులు మరియు దళిత కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, కలెక్టరేట్ ఎదుట ధర్నా

రాజమండ్రి, జూలై 30 పల్లె వెలుగు అన్ని



సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వేతనాలు పెంచాలని, కార్మిక చట్టాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గడిచిన 15 ఏళ్లుగా వేతనాలు పెంచకుండా ప్రభుత్వం కార్మికులను యాజమాన్యాల దోపిడీకి వదిలేసిందని, పెరిగిన జీవన వ్యయంతో అర్థాకలితో ఉంటున్నారని సీఐటీయూ సీనియర్ నాయకులు ఎస్.ఎస్.మూర్తి విమర్శించారు. కర్ణాటక తరహాలో కనీస వేతనం పెంచాలని కోరారు. కార్మికులకు నష్టం చేసే 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుందర్ బాబు, బి.పవన్ డిమాండ్ చేశారు. అప్కాస్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, డైలీ వైజ్, కంటింజెంట్, థర్డ్ పార్టీ కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్ అమలు చేయాలని మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ జేఏసీ నాయకులు దయామని కోరారు. రూ.6000 జీతంతో కుటుంబాలు ఎలా గడవాలని, నాలుగు నెలల బకాయిలు విడుదల చేయాలని పాఠశాల ఆయాల నాయకులు వేణు ఆవేదన వ్యక్తం చేశారు. డెలివరీ బాయ్స్ కు కనీస వేతనాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని గ్యాస్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంటి.కృష్ణ డిమాండ్ చేశారు. 35 ఏళ్ల సర్వీసు పూర్తయిన వారికి రూ.9000 కనీస పెన్షన్ ఇవ్వాలని, రైల్వేలో సీనియర్ సిటిజన్ల రాయితీలు పునరుద్ధరించాలని పెన్షనర్స్ యూనియన్ నాయకులు సిహెచ్.మోహన్ రావు అన్నారు. పరిశ్రమల్లో 8 గంటల పని విధానం కొనసాగించాలని, అదనపు పనికి రెట్టింపు వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి రామచంద్రరావు డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్ఓకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కర్రి రామకృష్ణ, ఎం రమేష్, సుంకర వెంకటేశ్వరరావు, మైరెడ్డి శేషు, అక్కాబత్తుల వరప్రసాద్, మిరియాల ధనరాజు, పూజారి వాసు, కళ్యాణ్, రాజేష్, తూరుగోపు చిరంజీవి, బి.నాగేశ్వరరావు, ఈ ఎన్ వి రమణ, రమేష్, సోమేశ్వరరావు, ఆంజనేయులు, జువ్వలరాంబాబు, ఎన్ సత్తిరాజు, శ్రీనివాస్, ఎస్.వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

## అనకాపల్లిలో ఘనంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ!

అనకాపల్లి,జూలై 30,పల్లె వెలుగు





ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ కార్యక్రమం అనకాపల్లి నియోజకవర్గంలో నేడు (బుధవారం) ఉదయం 6:00 గంటల నుంచే అత్యంత ఉత్సాహంగా ప్రారంభమైంది. సాధారణంగా ప్రతి నెల 1వ తేదీన పంపిణీ చేసే పింఛన్లను, ఆగస్టు 1న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా-ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మరియు కేంద్ర విమానాశ్రయాల శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో, ఒక రోజు ముందుగానే అనగా జూలై 30వ తేదీనే (ఈరోజు) లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా, మాజీ ఎమ్మెల్సీ మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు అనకాపల్లి గవరపాలెం అరుంధతి నగర్ ఎస్సీ కాలనీలో స్వయంగా పర్యటించారు. అక్కడ వృద్ధులు, వికలాంగులు మరియు వితంతువులను కలిసి వారికి ప్రభుత్వం తరపున అందించే రూ. 4,000 మరియు రూ. 6,000 పింఛన్ల మొత్తాన్ని పంపిణీ చేశారు.ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక భరోసా పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. నిర్ణీత సమయానికి ముందే, ఎలాంటి అంతరాయం లేకుండా ఇంటి వద్దకే పింఛన్లు అందుతుండటం పట్ల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంద్రేగుల సత్యనారాయణ, పెట్ల సత్యనారాయణ, మల్ల గణేష్, బుద్ధ శ్రీను, బుద్ధ మహాలక్ష్మి నాయుడు, పెంటకోట ఆనంద్, బుద్ధ లక్ష్మీ అప్పారావు, కొణతాల కారుబాబు, బాలు తదితర కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## లచ్చిరాజు చెరువు భూముల, ఆక్రమణల తొలగింపునకు ఎంపీడీఓ పరిశీలన

కాట్రేనికోన, జూలై 30పల్లె వెలుగు: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా



కాట్రేనికోన గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపాలెం లచ్చిరాజు చెరువు పరిసర ప్రాంతాల పంట భూములకు రహదారి ఏర్పాటు చేయడం మరియు ఆక్రమణల తొలగింపుపై రైతాంగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) బి. రాజేశ్వర్ రావు నేరుగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. రైతులు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను తొలగించేందుకు అధికారులు ఈ చర్యలు చేపట్టారు.క్షేత్రస్థాయి పరిశీలన మరియు అధికారుల హామీ చెరువు పరిసరాల్లోని సాగు భూములకు వెళ్లే దారి సరిగా లేకపోవడం, అనధికారిక ఆక్రమణల కారణంగా రైతులు పంటల రవాణాకు పడుతున్న ఇబ్బందిని స్థానిక రైతాంగం ఎంపీడీఓ దృష్టికి తీసుకువచ్చింది. దీనిపై స్పందించిన ఎంపీడీఓ బి. రాజేశ్వర్ రావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం గౌరవ శాసనసభ్యులతో (మీూా) చర్చించి, సదరు రహదారి నిర్మాణానికి తగిన ప్రతిపాదనలు త్వరలోనే రూపొందిస్తామని రైతులకు భరోసా కల్పించారు. రహదారి నిర్మాణం పూర్తయితే స్థానిక రైతుల సాగు ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు.కార్యక్రమంలో బి.రాజేశ్వర్ రావు (ఎంపీడీఓ),ఎన్. శంకర్ నారాయణ (డిప్యూటీ ఎంపీడీఓ)జె.వి. సత్యనారాయణ (పంచాయతీ కార్యదర్శి) స్వర్ణ గ్రామ సిబ్బంది మరియు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి నూకాలమ్మ సేవలో ఎమ్మెల్యే బండారు



అనకాపల్లి, జూలై 30: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురం పర్యటన నేపథ్యంలో ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం అనకాపల్లి నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వచనం అందించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం ఆలయంలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. తర్వాత ఎలమంచిలి సమీపంలోని కొండకర్ల ఆవును సందర్శించి పర్యావరణ పరిరక్షణ, పర్యాటక అభివృద్ధి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పర్యటన ద్వారా కొత్తపేట నియోజకవర్గంలో పర్యాటకాభివృద్ధికి అమలు చేయదగిన నమూనాలపై అవగాహన లభించిందని ఎమ్మెల్యే తెలిపారు.

## గంగాలమ్మ జాతర.. ప్రత్యేక పూజలు నిర్వహించిన మాలసాల కుమార్ రాజా



అనకాపల్లి, జూలై 30పల్లె వెలుగుఅనకాపల్లి పట్టణంలోని 84వ వార్డు చేపల బజార్ వద్ద శ్రీ గంగాలమ్మ అమ్మవారి జాతర గురువారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక గంగపుత్రుల విశేష ఆహ్వానం మేరకు ఈ వేడుకల్లో మాలసాల కుమార్ రాజా ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు, మత్స్యకారులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో పట్టణం ఎప్పుడూ కళకళలాడుతూ వర్ధిల్లాలని ఆయన ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, 84వ వార్డు వైయస్సార్సీపీ ఇంచార్జ్ కోరుకొండ రాఘవ, శిరసపల్లి సాంబ, మాధురి నాయుడు, శేషు, ఉగ్గిన అప్పారావు, సిరసపల్లి రాజు, మణికంఠ, గోపి, శ్రీరామ్ మూర్తి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. జాతర సందర్భంగా చేపల బజార్ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.

## మంచినీటి సమస్యలపై తక్షణ స్పందన ! పైపులైను మరమ్మత్తులను పరిశీలించిన ఎం.పీ.డీ.ఓ

కాట్రేనికోన, జూలై 30పల్లె వెలుగు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సత్వరమే పటిష్టమైన కార్యాచరణ



రూపొందించాలని ఎంపీడీఓ బి. రాజేశ్వర్ రావు అధికారులను ఆదేశించారు. గురువారం కాట్రేనికోన గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న మంచినీటి పైపులైను మరమ్మత్తు పనులను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సరఫరా తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి జె.వి. సత్యనారాయణతో మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడైనా మంచినీటి సమస్యలు వస్తే వెంటనే స్పందించాలని సూచించారు. పంచాయతీ సిబ్బంది ప్రతి వీధికి సంబంధించి పైపులైను లీకేజీలను గుర్తించి, ఎలాంటి అలసత్వానికి తావులేకుండా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు డిప్యూటీ ఎంపీడీఓ ఎన్. శంకర్ నారాయణ, పంచాయతీ కార్యదర్శి జె.వి. సత్యనారాయణ, స్వర్ణ గ్రామ సిబ్బంది మరియు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అగనంపూడి లో రెండు రోజుల ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ.

అగనంపూడి, జూలై 30పల్లె వెలుగు జీవీఎంసీ పరిధిలోని 79వ వార్డు



అగనంపూడి లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు మరియు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఆలస్యం లేకుండా రెండు రోజుల ముందుగానే పింఛన్లను పంపిణీ చేయడం విశేషం.ఈ కార్యక్రమంలో భాగంగా, గాజువాక మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనక భవాని సచివాలయ సిబ్బందితో కలిసి నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లారు. వృద్ధులు, వికలాంగులు మరియు ఇతర అర్హులకు వారి గడప వద్దే పింఛన్లను అందజేసి ప్రభుత్వ భరోసాని కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎలాంటి జాప్యం లేకుండా, అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి సకాలంలో అందేలా కూటమి ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోంద ని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా ప్రజల ముంగిట్లోకి చేరుతుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో 79వ వార్డు జనసేన అధ్యక్షుడు మేడిశెట్టి విజయ్, టీడీపీ సీనియర్ నాయకులు గొల్లవిల్లి వెంకట్రావు, బీజేపీ వార్డు మహిళా నాయకురాలు కుమారి, బూత్ ఇన్‌చార్జ్‌లు తైడా లక్ష్మణరావు, సీతన అప్పలరాజు, అలాగే సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం

రాజమహేంద్రవరం, జూలై 30 పల్లె వెలుగు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి



రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

హామీని అధికారంలోకి వచ్చాక నెరవేరుస్తున్నామని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. 27వ డివిజన్ వీటీ కాలేజ్ ప్రాంతంలో నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించడం ద్వారా మహిళలకు భారం తగ్గిందని, తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో అభివృద్ధి జరగలేదని, కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో సాగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో మరింత అభివృద్ధి చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రామాలయం వీధికి చెందిన డయాలసిస్ బాధితురాలు కడియాల లక్ష్మికి రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల రవి రామ్ కిరణ్, మజ్జి పద్మావతి శ్రీనివాస్, మచ్చేటి ప్రసాద్, దాలిపర్తి వేమన, నిమ్మలపూడి గోవిందు, బూర దుర్గారావు, కొప్పిశెట్టి చిన్ని, నరసింహమూర్తి, రొంపిచర్ల ఆంటోనీ, కక్కల రమేష్, పల్లి సాయి, ఏడాకుల వెంకటేశ్వరరావు, కుంచె హనుమంతరావు, అర్జీల లక్ష్మణరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

## జర్నలిస్టుపై కాంట్రాక్టర్ దాడి : పోలీసులకు ఫిర్యాదు

యానాం, జూలై 30 పల్లె వెలుగు ప్రజాధనంతో నిర్మిస్తున్న రక్షణ గోడ పనుల్లోని నాణ్యతా




లోపాలను చిత్రీకరిస్తున్న జర్నలిస్టుపై కాంట్రాక్టర్, అతని అనుచరుడు దాడి చేసిన సంఘటన కలకలం రేపింది. అఖండ భూమి పత్రిక యానాం నియోజకవర్గ ప్రతినిధి మండపాక సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నల్ల చెరువు వద్ద నిర్మాణ పనులను ఆయన వీడియో చిత్రీకరిస్తుండగా కాంట్రాక్టర్ మట్టపర్తి గణేష్, అతని బావమరిది పెద్దింశెట్టి రాజా తీవ్ర ఆగ్రహంతో దాడికి దిగారు. రెండు చెంపలపై కొట్టడంతో పాటు జేబులో ఉన్న నగదు, సెల్‌ఫోన్ లాక్కొని అసభ్య పదజాలంతో దూషించారని బాధితుడు ఆరోపించారు. ఘటన సమయంలో నిర్మాణ పనులను పర్యవేక్షించాల్సిన పీడబ్ల్యూడీ జేఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ అక్కడ లేరని, కేవలం ఒక ఎంఎటీఎస్ ఉద్యోగి మాత్రమే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ దాడిలో తనకు ఎడమ చెవికి గాయమై వినికిడి సమస్య ఏర్పడిందని, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు తెలిపారు. స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చినా నిందితులకే అనుకూలంగా వ్యవహరిస్తూ తనకు న్యాయం చేయడం లేదని సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై యానాం ఎస్పీ, స్టేషన్ హౌస్ ఆఫీసర్, పుదుచ్చేరి డీజీపీ, డీఐజీ, ఎస్ఎస్పీలకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు

## అధికారులతో కలిసి యానాంలో మంత్రి మల్లాడి కృష్ణారావు పర్యటన

యానాం, జూలై 30 పల్లె వెలుగు పుదుచ్చేరి సీనియర్ మంత్రి, యానాం ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు అధికారుల బృందంతో కలిసి యానాం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి రంగస్వామి ఆదేశాల మేరకు పుదుచ్చేరి కలెక్టర్ కొళోతుంగన్, న్యాయశాఖ కార్యదర్శి విక్రాంత్ రాజా తదితర ఉన్నతాధికారులు మంత్రి మల్లాడి కృష్ణారావుతో కలిసి పర్యటనలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను వారు ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. ముఖ్యంగా నిరుపేదలకు ఇళ్ల స్థలాల సేకరణకు సంబంధించిన భూముల పరిశీలన, డంపింగ్ యార్డ్ ఏర్పాటు, నూతన కోర్టు నిర్మాణానికి స్థల సేకరణ తదితర ప్రాధాన్యత కలిగిన అంశాలపై మంత్రి మల్లాడి కృష్ణారావు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, తదుపరి చర్యలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నారు

## మానవ అక్రమ రవాణాను అరికడదాం

ముమ్మిడివరం, జూలై 30పల్లె వెలుగు ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్, జిల్లా వెట్టి విమోచన కోలిషన్ ఆధ్వర్యంలో "వెట్టిచాకిరి



ఒక లోతుగా వేళ్లూనుకున్న మోసం" అనే సందేశంతో రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముమ్మిడివరం ఎంపీడీవో ఎన్ దీక్షితులు మాట్లాడుతూ గ్రామపంచాయతీలు, గ్రామ సచివాలయాలు, స్వయం సహాయక సంఘాలు మరియు గ్రామస్థాయి సిబ్బంది సమాజంలోని బలహీన వర్గాలను గుర్తించి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేయడం ద్వారా వెట్టిచాకిరి, మానవ అక్రమ రవాణాను అరికట్టవచ్చని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాలు, ఉపాధి అవకాశాలు మరియు జీవనోపాధి కార్యక్రమాలు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచి, మానవ అక్రమ రవాణా మరియు వెట్టిచాకిరికి గురికాకుండా కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ వివరించారు. ఈ సందర్భంగా అధికారులు, పాల్గొన్న వారందరూ కలిసి మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కట్టుబడి పనిచేయాలని, అనుమానాస్పద సంఘటనలను వెంటనే అధికారులకు తెలియజేస్తూ ప్రతి ఒక్కరి స్వేచ్ఛ, గౌరవం మరియు మానవ హక్కులను కాపాడాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కే వెంకటేశ్వరరావు, సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ బి నాగార్జున, ఎం శివకుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రభాకర్ పర్యటన

తాళ్ళరేవు, జూలై 30 పల్లె వెలుగు ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని తాళ్ళరేవు మండలం



సుంకరపాలెం గ్రామంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రభాకర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గతంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. సదరు స్థలాన్ని ప్రస్తుతం కళ్యాణ మండపంగా ఉపయోగిస్తున్నట్లు సమాచారం రావడంతో, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను నేరుగా తెలుసుకునేందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ పర్యటనలో డాక్టర్ ప్రభాకర్ తో పాటు తాళ్ళరేవు కో లొకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఈశ్వర్, ఎల్ డి సి షర్మిల, ఏఎన్ఎం లక్ష్మీకాంతం, ఎం సి హెచ్ పి పావని, హెల్త్ అసిస్టెంట్లు బివిఎల్ శ్రీను, ఓ శ్రీను, కే ఆంజనేయులు మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com